నా కోరిక

"ఏం. అక్కాయ్?"

ఉలిక్కిపడి చూశాను పత్రిక చదువు కొంటూన్న నేను. నవ్వుతూ కుర్చునివున్నాడు రామచంద్రం తమ్ముడు.

"భలేవాడివే! చడీచప్పుడూ లేకుండా ఎలా వచ్చావ్?"

"ఇప్పుడే! వీధితలపులు దగ్గిరిగా వేసివుంటే పిలవటం దేనికని..." తన చనువు ప్రకటించుకున్నాడు– "నువ్వేదో చదువుకుంటున్నావుగదాని..."

"ఊఁ" పుస్తకంమూస్తూ అన్నాను. "వారం దాటి పోలా నువ్వు కన్పించి...?"

"అయితే నా నవల చదివేశావా?" ఉత్సాహంగా చూశాడు. నిన్న బావ బజార్లో కన్పిస్తే అడిగాను, నువ్వుచదివిందీ లేందీ తెలీదన్నాడు. మళ్లా నీకు జ్ఞాపకం చెయ్యమని చెప్పాను."

"ఇంటికి చేరేవరకూ నీ మాట జ్ఞాపకం వుండేదెలా? నువ్విచ్చిన మర్నాడే చదివేశాను. నీకు చెప్పమని కూడా చెప్పాను. ఒట్టి మతిమరుపు మనిషి" లేచివెళ్ళి డ్రాయర్ లోంచి కాయితాల కట్టలు బయటికి తీసుకువచ్చాను.

అసలు సంగతేమిటంటే ... ఓ రెండు మూడేళ్ళుగా రామచంద్రం తమ్ముణ్ణి, తనో బ్రహ్మాండమైన రచయితనై

పోవాలనే కోరి కొకటి తినేస్తోంది. తెల్లగా సన్నగా చిన్నగా వుండే రామచంద్రం చాలా గడుసువాడేమరి. అయితే మాత్రం...? ఆ ఫలానా కోరికకులొంగి ఓ పాతిక కథల వరకూ రాశాడు. రెండు తక్కువ డజను ఆర్టికల్స్ రాశాడు. అరడజనుకి ఒకటి ఎక్కువే స్కెచ్‌లు రాశాడు. నాలు గైదు... నాలుగేశాబోలు... నోవెల్స్ రాశాడు. ఓ స్టైర్ కూడా రాయా లనుకొంటున్నాడు.

పది పేజీల్లో ముగిసిపోతే షార్ట్ స్టోరీ! మరీ పెద్దదైతే నోవెల్! కాకపోతే నవలిక! కొన్ని కొన్ని... అన్నీ ఎలాగూ రావుగా?... పత్రికల్లోకూడా వచ్చాయి.

కాని... చిత్రమే? – "మీ ఫలానా... చదివాను. చదువుతూ చదువుతూ నన్ను నేను మర్చిపోయాను. మీ రచన నా హృదయాన్ని వూపింది. మీకూ ... ఎడిటర్ కీ..." అంటూ ఒక్క కార్డుముక్క కూడా తన హృదయ పూర్వక అభినందనాలు సమర్పించలేదు. ఒక్క పాఠకుడు కూడా "ఓహో! మీరా!" అనేలా రామచంద్రాన్ని గురు పెట్టుకోలేదు. "బొత్తిగా ఈ పాఠకులు ఎటు గాలి మళ్ళితే అటే పోతుంటా రక్కాయ్" అంటాడు తమ్ముడు చాలాసార్లు.

"అక్షరాలా నిజం," అంటూ ముందే ఒప్పేసు కుంటాను. ఎలాగైనా ఈ పాఠకజనాన్ని మంత్రముగ్ధుల్ని చేసి బంధించి పారెయ్యాలని చాలకాలంగా ఆలోచిస్తూనే వున్నాడు రామచంద్రం – పర్యవసానమే ఈ మహోజ్వాల నవలా సృష్టి!...దుర్మార్గుల తంత్రాలతో... మాంత్రికుల

మంత్రాలతో... నాయకీ నాయకుల త్యాగాలతో...మహో పన్యాసలతో... మాటల ఈటెలతో... దుఃఖ సముద్రాలతో... అక్షరాల అట్టహాసాలతో... వగైరా వగైరాలతో... చివరి కది...?

నేను కాయితాలు తిరగవేస్తోంటే పరీక్షా ఫలితాలు వినబోయే విద్యార్థిలా నా మొహంలోకే చూస్తూ కూర్చున్నాడు తమ్ముడు – అదేమీ కనిపెట్టనట్టు నవ్వుతూ అన్నాను– "నీ నవల చదివాను... ఏం చెప్పమంటావ్?" రుమాలుతో నుదురు ఒత్తుకొంటూ ఏదో చెప్పబోయినవాణ్ణి వారిస్తూ నేనే అన్నాను– "నేనేం చెప్పినా కష్టపెట్టుకో నని... నిరాశపడి కృంగిపోనని.. చివరికి ఆత్మహత్యకోసం ఆలోచించనని... సరేనా?" నవ్వేశాను వాతావరణాన్ని సాధ్యమైనంత తేలికచేస్తూ.

"సరే! సరే! చెప్పెయ్ అక్కాయ్! నీ వుద్దేశ్యాలు ఖచ్చితంగా చెప్పెయ్! అయితే నా నవల నచ్చనేలేదు కదూ?"

"ఎందుకు నచ్చలేదు? నీ నవల చదువుతోంటే ఎంత తొంతట ముందుకు పోతామా అన్నంత ఆతృతా, ఉత్కంఠా కలిగి చచ్చాననుకో."

తమ్ముడి మొహం కాస్త వన్నెమారింది – "వెటకారం చేస్తున్నావు"

"అదిగో, అదే ఒద్దన్నాను. నేను చెప్పిం దేమిటి? నీకు అర్థమైం దేమిటి?"

నేను చెప్పిం దేమిటో రామచంద్రానికి అర్థం కాక పోలేదు. ఆలోచించాడు ఓ క్షణం- "బోర్ కొడుతోందనేగా నీ వుద్దేశ్యం? అయితే అక్కాయ్? ఓ పనిచేస్తాను. మొదటి వాక్యం వుంచి రెండోది మూడోదీ కొట్టేస్తాను. నాలుగో వాక్యం వుంచి ఐదూ... ఆరూ... కొట్టేస్తాను. ఏడు వుంచి..." ఫక్కుమని నవ్వేశాడు-

"అప్పుడు చూడు. ఏం టెంపో! ఎంత సస్పెన్సూ."

"ఊఁ తర్వాత?" అన్నాడు నవ్వలేక.

బాగానేవుంది. అనుకున్నాను "ముందు ప్లాట్ విషయా నికి వద్దాం. తల్లిదండ్రుల్లేని అన్న చెల్లెళ్ళిద్దరూ రెండులక్షల రూపాయలు బ్యాంకులో వేసుకున్నారు. అన్నగారు గుమాస్తా వుద్యోగం చేస్తోంటే చెల్లాయి కుంపటిపొయ్యి మీద వండి పెడుతోంది- ఇద్దరూ ఒకర్ని ఒకరు సహృదయాలతో అపా రంగా ప్రేమించుకొంటూ అతి సామాన్యమైన జీవితం గడుపు తున్నారు- దీని కేమైనా అర్థం వుంటుం దంటావా?"

"నువ్విలా అడుగుతా వని నాకుముందే తెలుసు. అయితే పూర్వం రాజ కుమారులు సింహాసనం ఎక్కేముందు దేశాటనం చేస్తూ సామాన్యమైన జీవితం అనుభవిస్తూ కష్ట సుఖాలు తెలుసుకునే వారు. దానికి నువ్వేం చెప్తావ్?"

"అందుకని నీ హీరో జీవితాన్ని చవిచూస్తున్నా డన్నమాట."

"అంతేకాదు. 'ఉద్యోగం పురుష లక్షణం', ఎంత డబ్బు వున్నా నా హీరో పురుషుడుగానే బ్రతకాలి."

"గుమాస్తాగిరీ ఏం ఖర్మ? ఏదైనా బిజినెస్..."

"ఎందుకా గోల? నష్టంవస్తే...? అసలే పసివాడు! అనుభవం లేనివాడు."

"పోనీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడని..."

"ఒద్దు అక్కాయ్, గుమాస్తాగానే వుండనీ! వెరీ ఆనెస్ట్ ఫెలో! గబగబా ప్రమోషన్లు ఇప్పించేద్దాం. అలా ఆఫీసరైతే క్రెడిట్ కదూ?"

"ఊఁ, బావుంది. అయితే వాళ్ళకి రెండులక్షల రూపాయలూ వుండాలని అంటావా? తగ్గిస్తే...?"

"దారుణం! తల్లీ తండ్రీ లేనే లేరు గదా? ఆ మాత్రం బ్యాంకు ఎకౌంట్ లేకపోతే..."

"పసివెధలకు అంతడబ్బు చూపిస్తే పాడుచేసుకోరూ? ఓ ఏడాది తిరిగొచ్చేసరికి..."

ఓ క్షణం ఆలోచించాడు– "గుడ్ ఐడియా! డబ్బంతా ఫిక్సెడ్ డిపాజిట్‌గా వేసేస్తే...?"

నాకు ఒళ్ళు మండింది– "ఎవరిపేర్న?"

"అవు ననుకో," నీరసంగా ఒప్పేసుకున్నాడు–"మరి?"

"బాగా పదివేల వరకూ తగ్గించెయ్."

"అన్యాయం! అన్యాయం అక్కాయ్! వాళ్ళ తల్లి తండ్రులిద్దరూ చచ్చిపోతూ అంతడబ్బూ వాళ్ళ కిచ్చారు."

తమ్ముడి గోల విన్పించుకోలేదు నేను – "వాళ్ళ కారు కూడా అమ్మేయ్!"

తృళ్ళిపడ్డాడు– "కారుకూడానా?... ఏం? ఎందుకని? అసలే 'లత' గులాబీ రెక్కలాంటిది. మనస్సు బావుండనప్పు డల్లా పై రెలా వెళ్తుంది? అన్నట్టు డ్రైవింగ్ కూడా నేర్చు కుందే!"

మళ్ళా అన్నాను– "వాళ్ళకి మేడ కూడా వద్దు."

అదిరిపడ్డాడు. అయోమయంగా చూశాడు– "తాతలు కట్టిన మేడ వాళ్ళకుంది. వద్దంటే ఎలా? వీల్లేదు."

రామచంద్రం ఇబ్బంది నాకు తెలుసు– ఆ మేడగురించి చాలా వర్ణించాడు. మేడనిండా గాజుగిన్నెల సెట్లు వ్రేలాడు తూంటాయని; చాలా విచిత్రాలు రాశాడు– వెనక గదుల్లోకి కొరివి దయ్యాలు వస్తూపోతూ వుంటాయని ... ఇంకా ఎన్నెనీ...!

నేను ఖచ్చితంగా అన్నాను– "మీ ఆవిడ కట్నం తెస్తుంది. మేడ కట్టుకుని కారుకూడా కొనుక్కుందువు గాని. నీ సరదా లన్నీ వాళ్ళమీద రుద్దకు – ఇక మాట్లాడకు." మళ్ళామాట్లాడే సాహసం లేక వూరుకున్నాడు.

"అయితే నాకు తెలీ కడుగుతానూ! నీ నవల్లో అన్నాచెల్లెలూ – మేనమామా – పెళ్ళికొడుకూ – పోస్టు జవానూ – నౌకరు వెంకన్నా – అంతా రచయిత లేనా?" అమాయకంగానే అడిగాను.

"ఛ! వాళ్ళెవరూ కారు;" తనొక్కడే రచయిత నన్నంత ధీమాగా చూశాడు. "ఏం? ఇప్పుడేమైంది?"

"మరి వాళ్ళంతా పెద్దపెద్ద మాటలూ అవీ వుపయోగించి బారెడేసి వాక్యాలతో కంఠతా పట్టి అప్పజెబుతోన్నట్టు కవిత్వపు ధోరణిలో మాట్లాతారేం?"

"అహ!... అదికాదు... వాళ్ళు...హీరో..." మాటల కోసం తడుముకొంటూ తికమక పడ్డాడు. నేనే అన్నాను "ఆ మేనమామ ముఖ్యమంత్రిలా ప్రతీ చాప్టర్‌కి అంతేసి వుపన్యాసం ఇస్తాడేం?"

రామచంద్రం మొహంలో కొత్త ఆశ చిగిర్చినట్టు కన్పించింది– "అసలా రంగనాథంగారు ముఖ్యమంత్రి కావాల్సినవాడే కదక్కాయ్! డబ్బులేక ఎలక్షనులో నిలబడలేదు– నిలబడక ఆయన్ని ఎవరూ గుర్తించలేదని తాలూకాఫీసులో పనిచేసుకుంటున్నాడు. అయితేమాత్రం ఆయనలో దాగివున్న టాలెంట్ ఏమైపోతుంది?"

"అందుకని?" నువ్వు చెప్పేది బాగా లేదన్నట్టు చూశాను– "ఎంత టాలెంట్ వుంటేమాత్రం లెక్చర్లిచ్చే హోదా ఎన్. జి. వో. కెక్కడిదయ్యా? బాగా తగ్గించెయ్ ఏడెనిమిది పంక్తులికి."

నచ్చలేదు రామచంద్రానికి. నాకై నేనే ముందుకు నడిచాను మాటలతో – "నీ రైటింగ్‌లో నేను గ్రహించిన కొన్ని లోపాలు చెప్తాను. కథా గమనం కోసం కాలాలు (టెన్సెస్) వాడే విషయంలో నువ్వు చాలా నిర్లక్ష్యం

చేశావు - ఇక్కడ చదువుతాను విను - "లత మనస్సు చాల సంతోషంగా వుంది. గోపాల్‌ని ఎంత తొందరగా కలుసుకుంటానా అని కలలు కంటుంది. స్వయంగా కార్ డ్రైవ్ చేసుకుంటూ బయల్దేరింది. ఓ ఫ్రెండ్ కనిపిస్తే సున్నిటి బుగ్గలమీద సొట్టలుపడేలా నవ్వుతూ విష్ చేస్తోంది. చివరికి థియేటర్ వేపుగా కారుని పరుగెత్తించింది." ఎలా వుందీ పేరా? భూత భవిష్యత్ వర్తమాన కాలాలు మూడూ ఒకే భావాన్ని వ్యక్తంచెయ్యటానికి ఉపయోగించావు. ఇక్కడ క్రియలకన్నిటికీ అన్వయం కుదిరిందా?" తననే చెప్పమన్నట్టు చూశాను.

"లేదనుకుంటాను." అనుమానంగా చూశాడు.

"అనుకోవటం ఏమిటి? లోపం ఏమిటో గ్రహించు."

"నీ రచన నడిచిందంతా వుత్తమ పురుషలో. నేనంటూ ఓ పాత్రే బయల్దేరి కథంతా చెప్తోంది - 'ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. మనస్సంతా పరిపరి విధాల పరుగులెడుతోంది. తన కెందుకీ ఆలోచనలు? ఎందుకింత వ్యథ తనకు?'- ఆ వాక్యాలు రెండూ చదివి దీనంగా చూశాను- "తమ్ముడూ"

"ఏమిటక్కాయ్! నువ్వు మరీను. అందులో ఏం తప్పువుంది?" బిక్క మొహం వేశాడు.

"ఇంత చిన్న విషయం తెలీకుండా నువ్వు రచన కుపక్రమించావంటే నీ సాహసానికి సంతోషించి తర్వాత పాఠకుల దౌర్భాగ్యానికి దీర్ఘంగా నిట్టూరుస్తాను. ఏమంటావ్?...

అదిగో! అలా కోపంగా చూడకు. నే నంటూ మాటాడే పాత్రే 'తను' శబ్దం వుపయోగించు కోవటం ఎలా సమం జసమో చెప్పు."

తమ్ముడు చాలపౌరుషంగా అన్నాడు– "ఎంతో పెద్ద పెద్ద వాళ్ళుకూడా ఒక్కొక్కచోట ఇలాగే రాశారు. కావా లంటే ఋజూ చేస్తాను. ఏమిటను కున్నావో!

"శాంతించు. నీకు ఆలోచించటం చేతకానంత కాలం అందరూ గొప్పవాళ్ళే!– అవకతవకగాపడే అడుగు జాడల్లో బయల్దేరి బోల్తాపడకు – ఇలావిను" – "ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. మనస్సు పరిపరి విధాల పరుగులెడుతోంది. నా కెందుకీ ఆలోచనలు? ఎందుకింత వ్యథ నాకు?" అని సరి దిద్దుకో."

తమ్ముడి మొహం విప్పారింది– "నిజమే అక్కాయ్! ఇప్పుడు బాగా అర్థమైంది." అన్నాడు సంబరంగా.

రామచంద్రాన్ని ఎంతోసేపు సంబర పడనివ్వకుండా ఓ కాయితం చేతి కిస్తూ అన్నాను– "ఈ శ్లోకానికి అర్థ మేమిటో చెప్పు. నాకు సంస్కృతం రాదుగా? శ్లోకం వదిలేసి పైనా కిందా చదివి వూరుకున్నాను. మరేం చెయ్యను?"

"నేను మాత్రం ఏం చెయ్య నక్కాయ్?" నసుగుతో న్నట్టన్నాడు.

"అదేమిటి? నిన్ను చదివి చెప్పమంటోంటే..."

"నాకూ రాదక్కాయ్!" సిగ్గు సిగ్గుగా చెప్పేశాడు –

"మరి?"

"దైవభక్తి భావంతో నిండివున్న శ్లోకం కావాలని అడిగితే నా ఫ్రెండ్ ఒకడు ఇది ఇచ్చాడు. కోట్ చేసేశాను. ఇలాంటివే మరికొన్ని కూడా..."

"ఆ ఫ్రెండ్‌కి మరో ఫ్రెండ్ వున్నాడేమో?..."

"లేదక్కాయ్! వాడు వాళ్ళ మేనత్త దగ్గిర కొంచెం సంస్కృతం నేర్చుకున్నాడు. సందర్భం కుదురుతుందనే చెప్పాడక్కాయ్!" ధీమాగా చూశాడు.

"అవును మంచిపని చేశావు. బొత్తిగా శ్లోకా లేవీ లేకుండా నవల రాస్తే వెల్తిగా వుంటుంది. అదీగాక రేపు సేల్సుకూడా బావుంటాయి. ఈ నవల కొంటే వేరే 'గీత' అక్కర్లేదు. అన్నట్టు పబ్లిషర్ కూడా పేజీలు పెరిగినకొద్దీ రాయల్టీ ఎక్కువిస్తాడు కదూ?"

నా మాటలు వింటోంటే రామచంద్రం వదనారవిందం గర్వంతో ఎరుపెక్కిపోయింది. "ఎంత తెలివైనపని చేశానో చూశావా?" అన్నట్టు చూశాడు.

"ఎందుకైనా మంచిది. సంస్కృతం తెలిసిన ఎడిట రెవరో వాకబుచేసి మరీపంపించు."

"అదేం?" నుదురు చిట్లించాడు.

"ఎందుకేనా మంచి దన్నానుగా?"

నిజం చెప్తోందా? అన్నట్టు అనుమానంగా చూశాడు నాకేసి.

"అయితే తమ్ముడూ! శిరీషకుసుమం ఎక్కడుంది? మీా దొడ్లోనా?"- మరో కాయితం తిరగేస్తూ అన్నాను.

"అమ్మో! మా దొడ్లోనే?... అబ్బే! లేదు"

"మరి? మీా మావయ్యగారి పెరట్లోనా?"

"ఊహూ! లేదుగా?"

"అసలా పువ్వు ఎలా ఉంటుంది? నే చూల్లేదులే."

"నేనూ చూల్లే దక్కాయ్! చాలా బావుంటాయట కదూ?"

"లతా గోపాల్ పచ్చికలో కూర్చుని ముచ్చట్లాడు కొంటూంటే చిరుగాలి విసురుకే శిరీష కుసుమాల పన్నీటి జల్లుపడి..." సమంజసమేనా? అన్నట్టు చూశాను.

"ఆ పువ్వుల తీగలకు పక్కగా పచ్చికలో వాళ్ళిద్దరూ కూర్చుని వున్నారని అనుకోకూడదూ?"

"అనుకోవాలి. శిరీషపుష్పం కొండంత బావుంటుందని అనుకోవాలి. చిరుగాలి విసురుకే ప్రక్కనున్న ప్రేమికుల మీాదికి ఎగిరిపడుతుందని అనుకోవాలి. తీగలనిండా విరగ బూసి పరిమళాలతో మత్తెక్కిస్తుందని అనుకోవాలి. అన్నిటినీ మించి నీ కథానాయిక లత చెంపల్లోని సున్నితత్వంముందు సిగ్గు పడుతుందనీ అనుకోవాలి. పాఠకుడి మేధకు నువ్వు చాలా విలువ యిచ్చావ్ తమ్ముడూ!"

దారుణమైన మౌనం ఓ క్షణం!

"అదంతా తప్పంటావా అక్కాయ్?"

"ఆ పువ్వువిషయం నాకేమీ తెలీదుగా! తెలీని సంగతి తప్పో ఒప్పో ఎలా చెప్పను?"

"నిజమే అక్కాయ్! పరిచయం లేకుండా అనుభూతి చెందకుండా రాస్తే టెక్నికల్‌గా లోపాలు వుంటాయేమో! అవునుకదూ?"

నవ్వేశాను— "సరే! ఈ ఆఖరి చాప్టర్‌లో సంభాషణలు చూడు." చదవటం ప్రారంభించాను.

"మామయ్యా! నన్ను క్షమించు. గోపాల్ నా హృదయేశ్వరుడు అంతేకాదు. జీవితేశ్వరుడు కూడా కాగలడు. గోపాల్‌ని నేను ఎన్నటికీ మరువలేను."

"లతా; ఆపు నీ అధిక ప్రసంగం. నన్నేనువ్వు ధిక్కరించగలవా? గోపాల్ గర్భ దరిద్రుడు."

"మామయ్యా! నిన్నే కాదు; భగవంతుని కూడా ఎదిరించ గలను. నా గోపాల్ దరిద్రుడే కావచ్చు, ఉత్తముడు! పురుషోత్తముడు. అన్నయ్యా! నా కన్నీరుచూస్తూ నువ్వింత రాయిలా ఎందుకు నిలబడ్డావు? నా గోపాల్ నుంచి నన్ను వేరుచేస్తావా? పువ్వునుంచి తావి వేరౌతుందా? చంద్రుడి నుంచి వెన్నెల వేరౌతుందా? ఆ దురదృష్టపు ఘడియ వస్తే నేను సంతోషంగా మరణిస్తాను."

"చెల్లీ! అంత మాటనకు."

"అన్నయ్యా!"

"చెల్లీ" — చదవటం ఆపేసి విరగబడి నవ్వాను. "తమ్ముడూ! ఎంత చిత్రంగా వుందీ సంభాషణ; డ్రామా వెయ్యాలంటే సరిపోతుందంటావా?"

"చాల్లేదుకదూ?" పొరపాటే అన్నట్టు చూశాడు. ఆశ్చర్యంగా నే నేదో చెప్పబోతే విన్పించుకోకుండా— "అది చాలా భారమైన ఘట్టం! ఇష్టంలేని పెళ్ళికూతురూ— తన స్వార్థంకోసం బలవంతంగా పెళ్ళి నిర్ణయించబోయే మేన మామా – ఎవ్వరికీ చెప్పలేక యిద్దరిమధ్యా ... నలిగిపోయే అన్నగారూ... వాళ్ళు ముగ్గురూ ఆవేశాలతో మాట్లాడు కోవాలంటే అదేం అల్లాటప్పా సీక్వేన్సా?" వీరావేశంతో నిటారుగా కూర్చున్నాడు.

నేను తాపీగా వెనక్కివాలి బుగ్గన వేలు వేసుకున్నాను– "అయితే ఆ సీక్వేన్స్ సంస్కృతంలో రాయలేక పోయావా?"

అయోమాయంగా చూశాడు.

"అదేమిటి, అలా చూస్తావ్? మరీవిపరీతంగా బ్రహ్మాండంగా వుండాల్సిన ఘట్టాలు సంస్కృతంలోనూ – ఏమంత ఫర్వాలే దనిపించి సర్వసామాన్యంగా వుండే సన్నివేశాలు తెలుగులోనూ– మత్తు మత్తుగా, ప్రేమ ప్రేమగా వుండాల్సినవి హిందీలోనూ రాస్తే...? ఏం? ఎందుకు బావుండదు? క్రొత్త ప్రయోగం కదూ?"

"పోనీవే అక్కాయ్! నీకేం నచ్చలేదని సూటిగా చెప్పరాదూ?" మొహం ముడుచుకున్నాడు.

నవ్వొచ్చింది నాకు — "సరేలే ముందు నా అనుమానా లన్నీ తీర్చుకోనీ! అయితే ఆఖర్న చెల్లెలు చచ్చిపోవటం దేనికి?"

మళ్ళా తమ్ముడి మొహం కలకల్లాడింది— "లత ఎందుకు చచ్చిపోవాలంటావా? చచ్చిపోక యిష్టంలేని పెళ్ళి చేసు కుంటుందా? ప్రియుడికి దూరమై... జీవితం భారమై..."

"సరే! సరే! యిష్టంలేని పెళ్ళి చేసుకోనంటే సరిపోలా?"

"ఏలా అనగలదు? అన్నా ఎవరు వింటారు? స్త్రీకి స్వతంత్రం లేదుగా?"

"ఓహో! నువ్వు యివ్వవు కాబోలు."

"కాదక్కాయ్! స్త్రీ సుఖంకోసం ఎన్ని చట్టాలు పాసౌతోన్నా అవి ఆచరణలో ఎంతమాత్రం నిజం కావటం లేదు. వాళ్ళ మేనమామ..."

"మధ్య వాడెవడయ్యా? అన్న వున్నాడుగా?"

"ఉన్నా సరే! లత చచ్చిపోవా లక్కాయ్!"

"చెల్లెల్ని అన్నగారు అపారంగా ప్రేమిస్తాడుగా?"

"ప్రేమించినా సరే. చచ్చిపోవాలక్కాయ్!"

"తర్వాత దుఃఖభారంతో అన్నగారుకూడా చచ్చి పోతే బావుంటుంది కదూ! చక్కటి సలహా యిచ్చాను.

"అవును బావుంటుంది."

"పశ్చాత్తాపంతో మేనమామా, మనోవేదనతో గోపాల్ కూడా చచ్చిపోతే...?"

"బ్రహ్మాండంగా వుంటుంది... కాని..."

"ఊఁ...కానీ...?"

"అంత దారుణమైన విషాదాన్ని మన తెలుగు పాఠకులు..."

"భరించలేరంటావా? లేకపోయినా అలవాటు చేసుకుంటారుగా? మనవాళ్ళ సైకాలజీ అర్థం చేసుకోవూ మరి?"

"నిజంగా అందర్నీ చంపేద్దామని నేనూ అనుకున్నాను గానీ..."

"అభ్యంతర మేముంది? నీ చేతిలో పని. నిజం చెప్పు. ట్రాజడీ రైటర్నై పోవాలని లేదూ నీకు?"

ఆశ వెల్లడించుకోలేని బిడియం. తమ్ముడి మొహం చూస్తూంటే నాకెంతో జాలి వేసింది. "ట్రాజడీ కావాలంటే పాత్రల నన్నింటినీ చంప నక్కర్లేదు తమ్ముడూ?"

"చావకుండా ట్రాజడీ?..." విస్తుపోయాడు.

"హీరోని హారైజన్‌లోకి పంపించేసి హీరోయిన్‌తో భారంగా నిట్టూర్పించు."

"అంతేనా?"

"ప్రస్తుతానికి అంతే."

"అలా చేస్తే అర్థం ఏమిటి?"

"అదేదో పాఠకులు ఆచించుకుంటారు లెద్దూ!" తమ్ముడికి నచ్చీ నచ్చనట్టుగా వున్నా మరేమీ అసలేదు.

"ఓ డ్రీమ్ సీక్వెన్స్ కూడా చేరిస్తే రేపు పిక్చరైజేషన్‌కి సావకాశాలు వుండేవి, ఆలోచించావా?"

"అదేమిటి? నేనేం పిక్చర్ కోసం ఈ నవల రాశానా?" తమ్ముడికి చాలా కోపంవచ్చింది. తనని నే నేదో అవమానం చేసినట్టే చూశాడు.

"ఛ! ఎందుకంత కోపం? మనం చేసే పనికోసం ముందు చూపు చూస్తే నష్టం ఏమిటి?"

"నీ వుద్దేశ్యం నాకు తెలుసుగానీ—నా నవలకన్నా గొప్ప పిక్చరేం రావటంలేదు. అంతవరకూ చెప్పగలను." సవాల్ చేస్తోన్నట్టే అన్నాడు.

ఈ విషయం మొట్టమొదటే చెప్తే నేను మరో దృష్టితో చదివేదాన్నిగా? ఫర్వాలేదు. పిక్చర్ కావచ్చు." చిత్రంగా మాయమై పోయింది తమ్ముడికోపం; ముసిముసిగా నవ్వుతూ కన్పించాడు. గమనించనట్టు వూరుకున్నాను— "ఇలాచూడు! చిన్న సందేహం! కాస్త ఈ వాక్యానికి అర్థంచెబుదూ!— "సృష్టిరహస్యాన్ని భేదించటమే మానవుడి ధ్యేయం!"— దీని అర్థమేమిటో బొత్తిగా నాకు కొరుకుడు పడటంలేదు. అసలు సృష్టి కో రహస్యం వుందంటావా?"

"భలేదానివే! సృష్టికి రహస్యం లేకపోవటం ఏమిటి? తప్పకుండావుంది."

"ఏమిటో అది?"

"తెలిసిపోతే అది రహస్యం ఎలా అవుతుంది?"

"ఓహో! అయితే దాన్ని మానవుడెందుకు ఛేదించాలి?"

"ఎందుకేమిటి? తెలుసుకుందుకు."

"తెలుసుకుని?"

"తెల్సుకుని... తెల్సుకుని...వూరికే తెలుసుకుందుకు."

నాకు కాస్త చిరాకు వేసింది—"సృష్టికో రహస్యం వుందో లేదో తెలీదు. ఉంటే అదేమిటో తెలీదు. దాన్నెం దుకు వెదకాలో తెలీదు. ఎందుకు తమ్ముడూ ఈ యాత నంతా! నీకే అర్థంగాని పచ్చి వేదాంతం రాసి..."

"అయితే సృష్టిలో ఏదో రహస్యంవుందని మహా మహా వాళ్ళు చెప్తోంటే అసలేమీ లేనే లేదంటావా నువ్వు?" విసుగ్గా అన్నాడు పందెం కాస్తూన్నట్టు.

"సృష్టికో రహస్యమంటూ వుంటే అది ఎవరికీ తెలియనిది కాదే. సుశీల ఆనంద్‌ని క్రీగంట చూసి సిగ్గుపడి పోవటంలో సృష్టి రహస్యంవుంది. ఉయ్యాల నుంచి జారిపడ్డ చిట్టితండ్రి గోరెడు దెబ్బ తగలకుండా కేరింతాలు కొట్ట టంలో సృష్టి రహస్యంవుంది. శ్మశానంలో ఏర్పడ్డ వైరాగ్యాన్ని మైలస్నానంతోపాటే మర్చిపోవటంలో సృష్టి రహస్యంవుంది. మొన్న నువ్వెక్కబోయిన బస్సు మిస్సయి తర్వాత జరిగిన యాక్సిడెంట్‌కి చిక్కకుండా ఇప్పుడిలా బ్రతికి వుండటంలో సృష్టి రహస్యంవుంది."

"అక్కాయ్!" ఉత్సాహంగా చూశాడు.

"సృష్టి నశించిపోకుండా తగిన రక్షణాలతో అభివృద్ధి చెందుతూనే వుంటుందికదూ? అదే సృష్టిరహస్యం."

"అది ఎప్పటి కప్పుడు వెల్లడౌతూనే వుంటుందిగా? ఇవ్వాళ మానవుడుకొత్తగా బయల్దేరి ఛేదించాల్సిందిఏముంది?"

"అది కాదక్కాయ్! మనం వుత్తమోత్తమమైన మనిషి జన్మ ఎత్తాంకదా? మనం చెయ్యాల్సిన ఘనకార్యం ఏదైన వుండద్దూ?"

"తప్పకుండాను. ప్రతీ మనిషీ ఒక ఘనకార్యం చెయ్యాలన్న ధ్యేయం చాలా గొప్పది – పుట్టినందుకు జీవించాలి. జీవించాలంటే తిండితినాలి. తినాలంటే శ్రమించాలి... శ్రమించా లంటే... ఇలా చెప్పుకుపోతే మనిషికి మనోవికాసం – మానసోల్లాసమ్ ఎంతైనా అవసర మని అర మౌతుంది. ఆ రెండు ప్రయోజనాలకోసమే సాహిత్యం. అది సృష్టించాలని ఆరాటపడే నువ్వు ధన్యుడివి తమ్ముడూ?"

రామచంద్రం తదేకంగా చూస్తూ కూర్చున్నాడు.

తమ్ముడి మొహంలోకి చూస్తూ అన్నాను – "కాని... సాహిత్యాని కో పవిత్రమైన స్థానం, అపారమైన విలువా వున్నాయన్న సంగతి మాత్రం మర్చిపోకు. అది గుర్తువున్నంత కాలం నీ కలం సజీవమైన సాహిత్యాన్నే సృష్టిస్తుంది. చౌకబారు రాతలు రాయనే రాయదు."

రెండు నిముషాల మౌనం! రామచంద్రం దిగులుగా అన్నాడు... "నేను చక్కటి కథలు రాయాలని ఎంత ఆశ పడుతున్నానో నీకు తెలీదక్కాయ్! ఎంత ప్రయత్నించినా... ఊహు! రాయలేక పోతున్నాను. లాభంలేదు. నాకేమీ రాదు." కోసి వుంచిన తోటకూర కాడలా వాడిపోయాడు.

"ఛ! అదే పొరపాటు. నా కేమీ రాదనుకోవటం కన్నా నా కెంతో వచ్చును కోవటంలోనే ప్రయోజనంవుంది- కథలు రాయాలనే నీ కోరిక హర్షించ దగ్గదే. కాని కాయితం మీద కలం పెట్టి రాసేదంతా సాహిత్యం అనిపించుకోదు- ఓ వంద సంవత్సరాలు పోయాక మన మంతా చచ్చిపోయాక రానున్న తరాలవాళ్ళు నీ పుస్తకం చదువుతారు. నువ్వు రాసిన ఈ పుస్తకమే జరిగిపోయిన చరిత్రను వెల్లడించే సాధన మౌతుంది. ఇప్పటి సంఘ నియమాలనీ - ఆచార వ్యవహారాలనీ- మంచి చెడలనీ- మొత్తంగా ఇరవయ్యో శతాబ్దంలో మనిషి బ్రతికిన తీరు తెన్నుల్నీ తెలుసుకోవటానికి ఆధార మౌతుంది. మనం జీవించిన విధానాన్ని గురించి వాళ్ళు నేర్చుకోవలసిం దేమైనా వుంటే నేర్చుకుంటారు. విస్మరించవల సినదాన్ని విస్మరిస్తారు- నీ పుస్తకంలో... నీ రాతలలో చరిత్ర దాగివుంటుందంటే... నీ కలాన్ని ఎంత బాధ్యతాయుతంగా నడిపించాలో ఆలోచించావా?" కళ్ళు విశాలం చేసి విస్మయంగా చూశాడు.

"వ్యక్తిగతంగా నీ మీద నా కేమీ కోపం లేదు. కాని... రచయితగా నీ కున్న బాధ్యతను విస్మరించి... రచన కున్న పవిత్రతను కూడా పోగొట్టే విధంగా ఇన్ని అతిశయాలతో... ఇన్ని అసందర్భాలతో... ఇన్ని అసత్యాలతో... ఇలాంటి పుస్తకాన్ని రాసి ప్రచురించాలని మోజుపడే నీ సాహసాన్ని క్షమించ లేను- తాత్కాలికంగా పాఠకుణ్ణి ఆకట్టు కొనేందుకు ఊహాలోకాలలో విహరింపజేసే తమాషాలు సృష్టించి— ఆవేశంలో ముంచెత్తే అశ్లీల సంభాషణలు

చిత్రించి- వేడి వేడి పెసరట్లలా "పుస్తకాలు అమ్ముకోవాలని ఆశించటం.. ఛ! ఎంత సంస్కారంలేని పని!" నా వేదనంతా వెల్లడించాను.

"అక్కాయ్! నిజంగా నే నంత దురాశ పడే రాశా ననుకుంటున్నావా?" దీనంగా అడిగాడు తమ్ముడు.

"కాకపోవచ్చు. అలా దురాశ పడి రాసినవాళ్ళ రాతల తాలూకు ప్రభావం మాత్రం నీ మీద చాలా వుంది. అది నీ ఈ రచనలో ప్రతిబింబించింది కూడాను. నీ సాహిత్యం పదికాలాలపాటు సజీవంగా నిలిచివుండా లన్న ధ్యేయాన్ని ఏర్పర్చుకుంటే నువ్వు ఏ ఇతర ప్రభావానికీ లొంగిపోవు- నీ స్వాతంత్ర్యం నీది. నీ శైలి నీది. నీ ప్రత్యేకత నీది-మొత్తంగా నీ రచనలో 'ఒరిజినాలిటీ' వుండాలి. అవునా?"

"నిజం అక్కాయ్! దాని కోసమే నేను ప్రయత్నిస్తు న్నాను."- ఒక్క క్షణం నిశ్శబ్దంగా గడిచింది- రామచంద్రం ఎప్పటిలా నవ్వుతూ అన్నాడు- "మొత్తంగా నా నవల ఖూనీ చేశావ్."

"కాదు తమ్ముడూ! సాన పట్టాను."

"అయితే యిప్పుడు నన్నేం చెయ్య మంటావు?"

"చెప్పానుగా? అర్థం కానట్టు మాట్లాడుతా వేం?"

"అయితే ఓ డజను మేజర్ ఆపరేషన్లు, అరడజను మైనర్ ఆపరేషన్లు... చెయ్యమంటావ్..." ఫక్కు మంటూ నవ్వాడు- "అప్పుడు...?"

నేనూ నవ్వాను ... "వైద్యంచేస్తే జబ్బునయం కాదూ?"... కాయితాల కట్టలు అందించాను.

"సరే! నే పోతా నక్కాయ్!" అంటూ లేచాడు.

"నే చెప్పిం దేమీ అపార్థం చేసుకోవుగా?" నేనూ లేచి తమ్ముడి వెనక నడుస్తూ అన్నాను.

"భలేదానివే! నే రాసిందంతా నీ చేతుల్లో ఎందుకు పెట్టాను?" వీధి గుమ్మం దగ్గిర ఆగి వెనక్కి చూస్తూ అన్నాడు ... "బావగాని కిళ్ళీకొట్టుముందు బాతాఖానీ కొడ్తూ కన్పిస్తే తొందరగా రమ్మన్నావని చెప్పనా?"

"ఏం అక్కర్లేదు. నా పత్రిక ఇంకా పూర్తి కాలేదు."

"వెళ్తా నక్కాయ్. గుడ్ నైట్!"

నవ్వుతూ— సైకిలెక్కి హుషార్‌గా పోతున్న తమ్ముణ్ణి చూస్తూ నిలబడ్డాను.

రామచంద్రం ఓ మంచి రచయిత కావాలి.

అది నా కోరికలలో ఒకటి.

('64 నవంబరు యువనుంచి)